## మైనర్ తప్పు.. మేజర్ ముప్పు

* అవగాహన రాహిత్యంతోనే ప్రమాదాలు * జిల్లాలో రోజు రోజుకూ పెరుగుతున్న బైక్ యాక్సిడెంట్లు * డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి

2లో



# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక



చదవండి.. చదివించండి..

జాతీయ వార్త

తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి వెళతాం - ఎడిటర్



శ్రీకాకుళం సంపుటి: 2 సంచిక: 41 | 9 శుక్రవారం ఫిబ్రవరి 2024 | పేజీలు : 4 వెల: 7.00


## నులి నివారణ మాత్రలపై..

# అపోహాలు తొలగించండి

* విద్యార్థులందరికి మాత్రలు పక్కాగా వేయాలి * నేడు అన్ని విద్యాసంస్థల్లో డీ వార్మింగ్ డే * 16న మాప్ అప్ డే * డీఎంహెచ్‌వో డాక్టర్ మీనాక్షి





**శ్రీకాకుళం, ఫిబ్రవరి8 (వార్త):** జిల్లాలోని అన్ని అంగన్వాడీ, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు మరియు జూనియర్ కళాశాలల్లోని విద్యార్థులకు నులి పురుగుల నిర్మూలన మాత్రలు పక్కాగా వేయించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ మీనాక్షి తెలిపారు. గురువారం జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంపై డీఎంహెచ్‌వో మీడియాతో మాట్లాడారు. ఈ మాత్రలు తీసుకోవడం వల్ల ఎటువంటి దుష్ప్రభావాలు ఉండబోవనే అపోహను విద్యార్థుల్లో తొలగించాలన్నారు. తద్వారా ప్రతి విద్యార్థి మాత్రలు వేసుకునేందుకు ముందుకు వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓలు, ఆశావర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, స్వచ్ఛంద సేవా సంఘాలు భాగస్వాములై విజయవంతం చేయాలని తెలిపారు. జిల్లాలో ఈ నెల 9న డీ-వార్మింగ్ డే, 16న మాప్ అప్ డే కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. డీ-వార్మింగ్ రోజున జిల్లాలో ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు డీ-వార్మింగ్ మాత్రలు (ఆల్బండ జోల్ 400 ఎంజీ) తప్పనిసరిగా నమిలించి తినిపించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో 1నుంచి 2ఏళ్ల వరకు సగం మాత్ర, 3 నుంచి 19ఏళ్ల వరకు గల విద్యార్థులతో పాటు పాఠశాలలకు వెళ్లని పిల్లలకు అంగన్వాడీ కార్యకర్తలు ద్వారా మాత్రలు వేయించాలన్నారు. ప్రతి పాఠశాలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్న భోజనం తరువాత ప్రతి విద్యార్థికి ఒక మాత్రను వైద్య ఆరోగ్య శాఖ, విద్యా శాఖ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తల సమన్వయంతో నమిలి తినిపించాలన్నారు. ప్రతి విద్యార్థికి చేతులు పరిశుభ్రత పట్ల అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న, బడికి వెళ్లని పిల్లలు, అంగన్వాడీ కేంద్రాల్లో ఉన్న మొత్తం 4,54,835 మందికి మాత్రలు పంపిణీ చేయబడ్డాయని అన్నారు. ఈ మాత్రలు వల్ల ఎటువంటి దుష్ప్రభావాలు ఉండబోవని చెప్పారు. ప్రతి పాఠశాలకు ఒక ఆరోగ్య సిబ్బందిని పర్యవేక్షకుడిగా నియమించినట్లు తెలిపారు. ఆశావర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, స్వచ్ఛంద సేవా సంఘాల వారు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. సమావేశంలో రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం జిల్లా సమన్వయకర్త డా.సి.పి.శ్రీదేవి, జిల్లా మాస్ పైడి వెంకటరమణ, డా. ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డా.ప్రకాష్, డా,వెంకటలక్ష్మి, డా.ప్రవీణ్, డా.సుజాత, ప్రోగ్రాం మేనేజర్ అప్పలనాయుడు, వెంకటేశ్వరులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఎన్నికలకు సమాయత్తం

* రాజకీయ పార్టీల సహకారం కీలకం
* ఓటింగ్ శాతం పెంచడంలో భాగస్వాములు కావాలి
* జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

**శ్రీకాకుళం, ఫిబ్రవరి8 (వార్త):**రానున్న సాధారణ ఎన్నికలు పారదర్శకంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీల సహకారం ఎంతో అవసరమని జిల్లా ఎన్నికల ప్రధాన అధికారి, జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో 32వ వారపు సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఎక్కడా రీపోలింగ్ జరపకుండా ఉండటం, ఓటింగ్ శాతాన్ని పెంచడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. సమస్యాత్మక, సున్నితమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించామని వెబ్ కాస్టింగ్, పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేయడం కోసం ప్రణాళికలు పూర్తిచేశామని వివరించారు. నామినేషన్లకు చివరి రోజు వరకు ఓటరు జాబితాలో చేర్పులు, మార్పుల కోసం అవకాశం ఉందని, ఎన్నికల తేదీని ప్రకటించిన తర్వాత మాత్రం తొలగింపు ప్రక్రియ నిలిచిపోతుందని స్పష్టం చేశారు. ఓటరు సహాయం కోసం 1950 టోల్ ఫ్రీ నెంబర్ పనిచేస్తుందని, రాజకీయ పార్టీలు లిఖిత పూర్వకంగా లేదా ఫోన్ ద్వారా ఏమైనా సలహాలు, ఫిర్యాదులు ఇవ్వదలుచుకుంటే వారి కోసం ప్రత్యేకంగా ఈమెయిల్ ఐడిని, ప్రత్యేక ఫోన్ నెంబర్‌ను కేటాయిస్తామని వాటి వివరాలు త్వరలో వెల్లడిస్తామని చెప్పారు. ఫారం-7 దాఖలు విషయంలో నిబంధనలు ఉల్లంఘించిన ఇద్దరిపై జిల్లాలో క్రిమినల్ కేసులు నమోదు చేశామని, ముందు ముందు ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగించే వ్యక్తులపై కూడా క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్ట పరంగా చర్యలు తీసుకుంటామన్నారు. తుది ఓటరు జాబితా ప్రకటన తర్వాత 0.1 శాతం మించి ఓటర్లను తొలగించడం సాధ్యం కాదని, ఈ విషయంలో ఎవరూ అపోహాలు పడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. సమావేశంలో జేసీ ఎం.నవీన్, డీఆర్వో జేవీఎస్ రామ్మోహనరావు, రౌతు శంకరరావు, పీఎంజేబాబు, మల్లిబాబు, సోమేశ్వరరావు, సురేష్ బాబు సింగ్ పాల్గొన్నారు.



## నేటి నేరవార్తలు

### మృగాడు

* కుమార్తెపై కన్నతండ్రి అకృత్యం
* పోలీసులకు ఫిర్యాదు చేసిన భార్య
* కటకటాల్లోకి నెట్టిన పోలీసులు

శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 8 (వార్త):

కుమార్తెను కాపాడుకోవాల్సిన తండ్రే.. ఆ బిడ్డ పాలిట మృగాడిగా మారిన ఘటన జిల్లాలో సంచలనం సృష్టించింది. భర్త తీరును సహించలేక భార్య కుమార్తెతో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల్లోకి వెళితే.. శ్రీకాకుళం నగరంలో నివాసం ఉంటున్న ఓ వ్యక్తి ట్రావెల్ ఏజెన్సీ నడుపుతున్నాడు. అతడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె మృతి చెందింది. చిన్న కూతురు 8వ తరగతి చదువుతోంది. గత నెలలో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. భార్య మీద కోపంతో తండ్రి కూతురిపై అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. మూడు రోజుల కిందట తల్లీకూతుళ్లు స్థానిక దిశ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి అతనిపై ఫిర్యాదు చేశారు. బాలిక జనవరిలో రజస్వల అయిన నాటి నుంచి ఈ అకృత్యాలు జరుగుతున్నట్లు వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. భయంతో తాను ఎవరికీ ఏమీ చెప్పలేకపోయానని బాలిక పోలీసులకు చెప్పింది. ప్రైవేటు భాగాలను పట్టుకోవడం, రాత్రిళ్లు వికృతంగా ప్రవర్తించడం చేసేవాడని తెలిపారు. ఈ ఫిర్యాదు మేరకు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. నిందితుడిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి బుధవారం రిమాండ్‌కు తరలించారు.

### నేడు జాబ్‌మేళా

**శ్రీకాకుళం టౌన్, ఫిబ్రవరి 8 (వార్త):** జిల్లా కేంద్రంలోని డీఎల్‌టీసీ/ఐటీఐ శిక్షణ కేంద్రంలో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహించనున్నామని జిల్లా ఉపాధి అధికారి కొత్త లంక సుధ తెలిపారు. పేటీఎం కంపెనీ, అపోలో ఫార్మసీ లిమిటెడ్ కంపెనీ, నవతా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీ, యూనివర్సిల్ గ్రూపు కంపెనీలో పోస్టులను భర్తీ చేసేందుకు ఈ జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

## ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దయ్యే వరకూ

# పోరాడాలి

* ఈ చట్టం అమలైతే దురాక్రమణ చేసేవాడిదే భూమి * టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ చట్టాన్ని రద్దు చేస్తాం * శ్రీకాకుళం పార్లమెంటరీ అధ్యక్షుడు కూన రవికుమార్ * కొనసాగుతున్న న్యాయవాదుల దీక్ష

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 8 (వార్త):** కార్పొరేట్లకు అనుకూలంగా తీసుకొచ్చిన భూయాజమాన్య హక్కు చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని టీడీపీ శ్రీకాకుళం పార్లమెంటరీ అధ్యక్షుడు కూన రవికుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా బార్ అసోసియేషన్ భవనంలో గురువారం జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ చట్టం అమలులోకి వస్తే ఆస్తులపై హక్కు కోల్పోవడమే కాకుండా ఆస్తి అంతా మరొకరి చేతుల్లోకి వెళ్తుందని, దీన్ని అంతా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. దురాక్రమణకు పాల్పడిన వాడిదే భూమి అన్నట్టు పరిస్థితి మారిపోతుందన్నారు. భూవివాదాలను పరిష్కరించే బాధ్యతను న్యాయస్థానాల నుంచి తప్పించి రెవెన్యూ అధికారులకు అప్పగించడం అర్థరహితమన్నారు. ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించలేని ఈ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇది ప్రజలు, న్యాయవాదుల సమస్య మాత్రమే కాదని, అందరి సమస్యగా భావించాలని కోరింది. భూయాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేసే వరకు ఐక్యంగా పోరాటం సాగించాలన్నారు. అప్రజాస్వామికంగా, రాజ్యాంగానికి వ్యతిరేకంగా ఉన్న ఈ చట్టం ప్రజల ప్రయోజనాలను దెబ్బతీసేదిగా ఉందన్నారు. 50 రోజులుగా ఈ చట్టంపై న్యాయవాదులు నిరసనలు తెలియజేస్తుంటే సీఎం జగన్‌మోహనరెడ్డి మొద్దునిద్రలో ఉన్నారా దీనిపై చర్చించాల్సిన బాధ్యత మీపై లేదా అని ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ చట్టంపై అసెంబ్లీలో చర్చించి, ప్రజలకు ఉండే ఇబ్బందులను తెలియజేసి రద్దు చేస్తామని హామీనిచ్చారు. కోర్టు క్యాంటీన్ ఎదురుగా న్యాయవాదులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షా శిబిరంలో రెండో రోజు న్యాయవాదులు సూర వేణుగోపాలరావు, చింతపల్లి సూర్యనారాయణ, మహిళా న్యాయవాదులు జె.అనితాదాస్, బెజ్జిపురపు సాయికీర్తి, కె.సత్యవాణి, కె.వెంకటలక్ష్మి, సంచాన విజయలక్ష్మి, పి నాగమణి, డి.అమత, అంపోలు సంధ్యారాణిలు కూర్చున్నారు. ముందుగా కోర్టు క్యాంటీన్ ఎదురుగా న్యాయవాదులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షా శిబిరాన్ని సందర్శించి తన సంఘీభావాన్ని తెలిపారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో బార్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాడ రాము, రాష్ట్ర బార్ అసోసియేషన్ మెంబర్ గేదెల వాసుదేవరావు, సీనియర్ న్యాయవాదులు శిష్టు రమేష్, వానకష్ణచంద్, సనపల హరి, కూన అన్నంనాయుడు, కొంక్యాన సుభాష్, ఎ మురళీమోహనరావు, టి. ఖగేంద్రనాథ్, కొత్తకోట అమ్మినాయుడు, అన్నెపు భువనేశ్వరరావు, ఆగూరు ఉమామహేశ్వరరావు, గురుగుబెల్లి నర్సింహమూర్తి, కంచరాన నాగభూషణరావు, జల్లు తిరుపతిరావు, పాడి సీతంనాయుడు, తాడి మధుసూదనరావు, తర్లాడ రాధాకష్ణ, భైరి జగదీశ్వరరావు, చౌదరి లక్ష్మణరావు, బొత్స సుదర్శనరావు, బగాది అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షులు గొండు శంకర్ గురువారం శిబిరాన్ని సందర్శించి న్యాయవాదులకు తన సంఘీభావాన్ని తెలిపారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం





## రథసప్తమి ఏర్పాట్లపై కమిషనర్ సమీక్ష

**అరసవల్లి, ఫిబ్రవరి8 (వార్త):** రథసప్తమి మహోత్సవానికి సంబంధించి భారీ సంఖ్యలో హాజరయ్యే భక్తులకు అరసవల్లిలో మున్సిపల్ కార్పొరేషన్ యంత్రాంగం చేపట్టాల్సిన చర్యలపై కమిషనర్ తమీమ్ అన్సారియా. ఆలయ ప్రాంగణం, పార్కింగ్, కోనేరు తదితర ప్రాంతాలలో పర్యటించారు. రథసప్తమి రోజున ముఖ్యంగా మంచినీరు, వైద్య సదుపాయం, మరుగుదొడ్లు తదితర అంశాల్లో ఎలాంటి ఫిర్యాదులు రాకూడదని అధికారులకు సూచించారు. ఆమె వెంట మున్సిపల్ ఇంజనీర్లు, పబ్లిక్ హెల్త్ సిబ్బంది, దేవదాయ శాఖాధికారులు ఉన్నారు.

# మైనర్ తప్పు.. మేజర్ ముప్పు

*** అవగాహన రాహిత్యంతోనే ప్రమాదాలు * జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్న బైక్ యాక్సిడెంట్లు**

*** డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి * జిల్లాలో 35వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలు**

**శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి8 (వార్త):** తల్లిదండ్రులకు పిల్లలే సర్వస్వం. వారిపై అతి ప్రేమతో బైక్‌లు, కార్లు ఇస్తున్నారు. వాటిని నడుపుతుంటూ అది చూసి సంబరపడుతున్నారు. అయితే కంటికి రెప్పలా పిల్లలను కాపాడుకోవాల్సిన తల్లిదండ్రులే వాహనాలు ఇచ్చి వారిని ప్రమాదాల్లోకి నెడుతున్నారు. పట్టణ, మండల ప్రాంతాల్లో ఎక్కువగా జరిగే ప్రమాదాల్లో ఒకటి మైనర్ డ్రైవింగ్ వల్లే. ప్రస్తుతం పిల్లలు వాహనాలు నడిపేందుకు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. తల్లిదండ్రులు వద్దని చెబుతున్నా వారి మాట వినకుండా ద్విచక్ర వాహనాలను తీసుకుని రహదారుల పైకి వస్తున్నారు. మరికొందరు స్వయంగా తమ



పిల్లలకు డ్రైవింగ్ నేర్పిస్తున్నారు. జిల్లాలో పలుమార్లు రహదారి ప్రమాదాలు జరుగుతున్నా... అవేమి పట్టించుకోకుండా మైనర్లు ద్విచక్రవాహనాలు నడుపుతూ డ్రైవింగ్‌పై అవగాహన రాహిత్యం వల్ల వల్ల ప్రమాదాలకు గురౌతున్నారు. సైకిల్ నడపాల్సిన వయస్సులో పిల్లలు ద్విచక్ర వాహనాలపై పాఠశాలలకు, కళాశాలలకు వెళ్తున్న విద్యార్థులు చాలా మంది ఉన్నారు. పిల్లలకు వాహనాలు ఇచ్చి దుకాణాల్లో సరుకులు తేవాలని పంపుతున్నారు. మరికొందరు తమ పిల్లలు వాహనాలు నడుపుతున్నారని గర్వంగా చెప్పుకుంటున్నారు. ఇలా అవ్వటం తప్పని తెలిసే తప్పు చేస్తున్నారు.

**డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరి...**

వాహనాలు నడపాలంటే 18 సంవత్సరాల పైబడి ఉండి డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలి. గంటకు 25 కిలోమీటర్ కంటే వేగంగా వెళ్లలేని వాహనాలకు మాత్రమే డ్రైవింగ్ లైసెన్స్,రిజిస్ట్రేషన్ అవసరం లేదు. 26 కిలోమీటర్ల కంటే ఒక్క కిలోమీటరు వేగంగా వెళ్లినా ఎలక్ట్రిక్ వాహనాలైనా రిజిస్ట్రేషన్ డ్రైవింగ్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలి.




### ఎన్నికల నియమావళి, ఐటీపై
## అవగాహన అవసరం
### సీపీవో లక్ష్మీ ప్రసన్న

**శ్రీకాకుళం టౌన్, ఫిబ్రవరి8 (వార్త):** ఎన్నికల నియమావళి, సమాచార సాంకేతికతలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని సీపీవో లక్ష్మీ ప్రసన్న అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సార్వత్రిక ఎన్నికలు-2024లకు సంబంధించి (ఎఎల్ఎంటి) మాస్టర్ ట్రైనర్స్ శిక్షణ తరగతులలో ఆమెతో పాటు మాస్టర్ ట్రైనర్స్ డిప్యూటీ సీఈవో వెంకటరామన్, మెప్మా పిడి కిరణ్ కుమార్‌లు పాల్గొని ఎంసిసి, ఐటీలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీపీవో లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ ఎన్నికల ఖర్చులు, ఎన్నికల నియమావళిలపై ఎఎల్ఎంటిలకు అవగాహన కల్పించారు. ఎన్నికల్లో ప్రజా ప్రతినిధులు వచ్చే సమయంలో ప్రోటోకాల్ ఉండదని జిల్లా పరిషత్ డిప్యూటీ సిఈఓ ఆర్.వెంకటరామన్ వివరించారు. ప్రభుత్వానికి సంబంధించి పథకాలు పేర్లు, రాజకీయ పార్టీల నాయకుల విగ్రహాలు కనిపించకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఫ్లైయింగ్ స్క్వాడ్స్ నిర్వహించాల్సిన విధులు, ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారిపై తీసుకోవలసిన చర్యలపైన వివరించారు. మాక్ పోలింగ్‌పై ఎఎల్ఎంటిలకు బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాడ్‌లపై వీడియో ద్వారా అవగాహన కల్పించారు. ఈవిఎంలపై అసెంబ్లీ లెవెల్ మాస్టర్ ట్రైనర్స్‌కు మెప్మా పీడీ కిరణ్ కుమార్ అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఆర్వో రామ్మోహనరావు, అసెంబ్లీ లెవెల్ మాస్టర్ ట్రైనర్స్ పాల్గొన్నారు.

# మైనర్లకు వాహనాలిస్తే యజమానులపై కేసులు

*** వాహనచోదకులు రహదారి భద్రత నియమాలు పాటించాలి * ఉప రవాణా కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి *వేంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ రహదారి భద్రత వారోత్సవాలు**






**ఎచ్చెర్ల:** మైనర్లకు యజమానులు వాహనాలిస్తే కేసు నమోదు చేయడంతో పాటు వాహనాన్ని సీజ్ చేస్తామని ఉప రవాణా కమిషనర్ చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. వాహనదారులు రహదారి భద్రత నియమాలు పాటించాలని స్పష్టం చేశారు. గురువారం జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో 35వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలు ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులతో ఏర్పాటు చేసిన సదస్సులో మాట్లాడారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేకపోవడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, రోడ్డు ప్రమాదాలపై అందరూ పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. డ్రైవింగ్ చేసే ప్రతి ఒక్కరూ సీటు బెల్టు, హెల్మెట్ ధరించాలని సూచించారు. ప్రతి ఒక్కరిలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించాలనే ముఖ్య ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని కళాశాలలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మద్యం తాగి వాహనం నడిపినా, మైనర్లు వాహనాలు నడపడం చట్ట రీత్యా నేరమని తెలిపారు. 18 ఏళ్లు దాటిన వారంతా చట్టపరంగా మోటార్ వెహికల్ లైసెన్సులను తీసుకోవాలన్నారు. డ్రైవింగ్ వ్యక్తిగత అనుభవంగా కాకుండా సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. వాహనాలు కండీషన్లో ఉండకపోవడం, అతివేగం, డ్రైవర్ల నిర్లక్ష్యం, అవగాహన లోపంతో రోడ్డు ప్రమాదాలు ఎక్కువ జరుగుతున్నాయన్నారు. చాల చోట్ల బ్లాక్ స్పాట్స్ ను గుర్తించి సేఫ్టీ స్పాట్స్‌గా మార్చడం జరిగిందన్నారు. స్పెషల్ డ్రైవ్ ద్వారా ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించగలుగుతున్నామన్నారు. అధిక రోడ్డు ప్రమాదాలు ప్రయాణంలో మొబైల్ వాడకం, మద్యపానం, అతి వేగం వలన జరుగుతున్నట్లు వివరించారు. ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలని కోరారు. ఈ అవగాహన కార్యక్రమంలో మోటార్ వెహికిల్ ఇన్ స్పెక్టర్లు పి. వి. గంగాధర్, ఆర్. అనిల్, తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్ నిరాశపర్చింది:కోండ్రు



**రాజాం, ఫిబ్రవరి8 (వార్త):** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరాశజనకంగా ఉందని టీడీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జి కోండ్రు మురళీ మోహన్ అన్నారు. శ్యాంపురంలోని టీడీపీ క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. బడ్జెట్లో వ్యవసాయరంగాన్ని పూర్తిగా విస్మరించారన్నారు. బడ్జెట్లో రాష్ట్ర ప్రయోజనాలు కాకుండా వైసీపీ ప్రయోజనాలే ఎక్కువగా కనిపిస్తున్నాయని తెలిపారు. సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే బడ్జెట్ రూపొందించినట్టు కనిపించిందన్నారు. ఏ వర్గానికి న్యాయం చేయని బడ్జెట్ ఇదని, పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి సరిపడా నిధులు కేటాయించలేదన్నారు. ఇది రాష్ట్ర బడ్జెట్ కాదని, సీఎం జగన్ మోహన్ రెడ్డి వ్యక్తిగత బడ్జెట్‌లా ఉందని దుయ్యబట్టారు. 13వేల కోట్ల రూపాయల రెవెన్యూ లోటును.. రూ.44వేల కోట్లకు, రూ.35వేల కోట్ల ద్రవ్యలోటును రూ.60 వేల కోట్లకు పెంచిన ఘనత ఆర్థిక మంత్రి బుగ్గనదేనన్నారు.

## ఇళ్ల రిజిస్ట్రేషన్ వేగవంతం చేయండి



**సంతకవిటి, ఫిబ్రవరి8 (వార్త):** ఇళ్ల రిజిస్ట్రేషన్ వేగవంతం చేయాలని, గ్రామ వార్డు సచివాలయ సేవలు పారదర్శకంగా అందించాలని ఎంపీడీవో రామకృష్ణ సచివాలయ సిబ్బందికి సూచించారు గురువారం మిర్తివలస సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన సచివాలయంలో ప్రతి నెల ఎన్ని సేవలు అందిస్తున్నారు. ఏ ఏ సేవలందిస్తున్నారు పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల రిజిస్ట్రేషనలో ఉన్న సాంకేతిక సమస్యలను ఎలా అధిగమించాలో సూచనలు చేశారు. ఆరోగ్యశ్రీ కార్డులు పంపిణీ పరిశీలించారు. ఆయన వెంట మండల పరిషత్ పరిపాలన అధికారి ఎస్ రఘునాథ చారి ఉన్నారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.



## రథ సప్తమికి బాలలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలి

**శ్రీకాకుళం కల్చరల్, ఫిబ్రవరి8 (వార్త):** రథసప్తమి వేడుకల్లో భాగంగా ఈ నెల 16న సూర్యనారాయణ స్వామి వారి దర్శనానికి వచ్చే బాలల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాల్సిందేనని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యుడు గొండు సీతారాంలు ఆదేశాలు జారీ చేశారు. గురువారం శ్రీకాకుళం జిల్లా పర్యటనలో ఉన్న వీరు అరసవెల్లి దేవస్థానం ప్రాంగణంలో రథ సప్తమి వేడుకల్లో పిల్లలకు కల్పించాల్సిన ప్రత్యేక సదుపాయాలపై దేవస్థానం అధికారులు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ,కార్మిక శాఖ,వైద్య, ఆరోగ్య శాఖ,మునిసిపల్ కార్పొరేషన్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంటి పిల్లలతో వచ్చే వారికి ప్రత్యేక దర్శన లైన్లు , మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఈ ఉత్సవాల్లో బాలల హక్కుల పరిరక్షణకు విఘాతం కలిగితే ఆయా శాఖల అధికారులపై క్రమశిక్షణా చర్యలకు రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసులు చేస్తామన్నారు. దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రమేష్ మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణలో ఎటువంటి విఘాతం కలగకుండా అన్ని శాఖల అధికారుల సమన్వయంతో పూర్తి ఏర్పాట్లు చేయనున్నట్టు తెలిపారు. సమీక్ష సమావేశంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ ఎం.శ్రీలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ శాంతిశ్రీ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు జి.వెంకట లక్ష్మి, వి.సురేష్ కుమార్, కార్మిక శాఖాధికారులు సువర్ణ, భాను, మునిసిపల్ అధికారి వెంకట్, జిల్లా బాలల సంరక్షణ అధికారి వెంకట రమణ, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

## ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం

***సివిల్ జడ్జి సన్యాసినాయుడు**

***ఉపకారాగారం, హాస్టల్ పరిశీలన**

**నరసన్నపేట, ఫిబ్రవరి 8 (వార్త):** ఖైదీలకు ఉచిత న్యాయ సహాయాన్ని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ద్వారా అందిస్తున్నామని సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి ఆర్ సన్యాసినాయుడు అన్నారు. గురువారం నరసన్నపేటలోని ఉపకారాగారాన్ని సందర్శించారు. ముద్దాయిలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఖైదీలకు ఎవరికైనా ఆర్థిక స్తోమత లేక న్యాయవాదిని పెట్టుకునే పరిస్థితి లేనప్పుడు న్యాయవాది నియమించి ఉచితంగా వారి కేసు న్యాయ సేవా అధికార సంస్థలు నడిపిస్తుందని తెలిపారు. ఆయన వెంట నరసన్నపేట ఉపకారాగారం పర్యవేక్షణ అధికారి వినయ్ కుమార్, ఇతర జైలు సిబ్బంది ఉన్నారు. అనంతరం నరసన్నపేటలోని బాలుర, బాలికల వసతి గృహాలను సందర్శించారు. వంటశాల, విద్యార్థినుల గదులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న అన్ని వసతులు అందేలా చూడాలని హాస్టల్ పర్యవేక్షణ అధికారులకు సూచించారు. ఆయన వెంట హాస్టల్ పర్యవేక్షణ అధికారులు బి.రమణ, పద్మావతి, త్రినాధరావు, సూర్యప్రభ ఉన్నారు.



## 10న జడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

**శ్రీకాకుళం టౌన్, ఫిబ్రవరి 8 (వార్త):** జిల్లా ప్రజా పరిషత్ స్థాయి సంఘ సమావేశాలు ఈ నెల 10న నిర్వహించనున్నట్లు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం పది గంటలకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రారంభమవుతుందన్నారు. ఉదయం 10 గంటలకు 6వ స్థాయి, 11 గంటలకు 3వ స్థాయి, మధ్యాహ్నం 12 గంటలకు 5వ స్థాయి సంఘం సమావేశం ఉంటుందన్నారు. అలాగే మధ్యాహ్నం 2 గంటలకు 2వ స్థాయి, 3 గంటలకు 4వ స్థాయి, సాయంత్రం 4 గంటలకు 7వ స్థాయి, 5 గంటలకు 1వ స్థాయి సంఘ సమావేశాలు నిర్వహించనున్నామన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

జిల్లా వార్తలు





## సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో కళల పాత్ర కీలకం

**ఎల్ఎన్‌పేట, ఫిబ్రవరి8 (వార్త):** సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో కళలు ప్రముఖ పాత్ర పోషిస్తుందని లయన్ డాక్టర్ ఎంకే మిశ్రో అన్నారు. లక్ష్మీనర్సుపేట గ్రామంలో జగన్నాథ స్వామి ఆలయం ప్రాంగణంలో కోలాటం నృత్య శిక్షణ కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఉర్మిళా పట్నాయక్ ఆధ్వర్యంలో 20మంది ఇక్కడ కోలాటంలో నృత్య శిక్షణ పొందుతున్నారు. ఈ సందర్భంగా ఊర్మిళ పట్నాయక్‌ను సన్మానించారు. ఈ కేంద్రానికి తోడ్పాటు అందిస్తున్న గ్రామ పెద్దలు ఊన్న ఫకీరు, ఉప సర్పంచ్ అశోక్ పాణిగ్రాహిలను అభినందించారు.

## రిమ్స్‌లో పిల్లల చికిత్సలపై సమీక్ష

**శ్రీకాకుళం టౌన్, ఫిబ్రవరి 8 (వార్త):** పిల్లలకు అరుదైన, దీర్ఘకాలిక వ్యాధులకు రిమ్స్‌లో ఎటువంటి వైద్య చికిత్సలు అందిస్తున్నారో తెలుసుకునేందుకు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్(ఏపి ఎస్సీపిసిఆర్) చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యుడు సీతారాం గురువారం ఆసుపత్రి ప్రాంగణంలో చిన్న పిల్లల వైద్య నిపుణులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అంతకుముందు పిల్లల వార్డులను సందర్శించారు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. అనంతరం వైద్యులతో సమీక్షించారు. గత రెండేళ్లుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించిన వారి వివరాలు, బ్రెయిన్ ఫీవర్ డెడ్ బాలల వివరాలు, వంశ పారంపర్యంగా ఎదురవుతున్న వ్యాధులు, అందిస్తున్న చికిత్సలపై ఆరా తీశారు. సున్నా నుంచి పదేళ్లు లోపు ఇన్సులిన్ వ్యాధితో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారి వివరాలు, వారి యోగ క్షేమాలుపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు, గత రెండేళ్లుగా గిరిజన ప్రాంతాల నుంచి చికిత్సకు వచ్చే పిల్లల వివరాలు, అంబులెన్స్‌లు సమకూర్చడంపైనా ఆరా తీశారు. రాష్ట్రంలోని బాలల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని అన్ని జిల్లాల ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రుల్లో సమీక్షలు చేపట్టి గమనించిన లోటు పాట్లుతో రాష్ట్ర ప్రభుత్వానికి, జిల్లాల ఉన్నతాధికారులకు వివిధ సిఫారసులు చేయనున్నట్టు తెలిపారు. సమావేశంలో సీడబ్లూసీ చైర్‌పర్సన్ శ్రీలక్ష్మి, ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ వి.బాల సుభాషిని, డిప్యూటి సూపరింటెండెంట్ డాక్టర్ సునీల్ నాయక్, పిల్లల వైద్య విభాగం అధిపతి కే.కోటేశ్వర రావు, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సతీష్ చంద్ర, డాక్టర్,ఎన్.వి.సుజాత, డాక్టర్ కే.మాధవి, డాక్టర్ ఎస్.జ్యోత్స్న, డాక్టర్ జి.రవి, స్త్రీ,శిశు సంక్షేమ శాఖ పీడీ శాంతిశ్రీ, జిల్లా బాలల సంరక్షణ అధికారి వెంకటరమణ, గర్ల్ చైల్డ్ డెవలప్మెంట్ ఆఫీసర్ నీరజ, సిడబ్లుసి సభ్యులు రమణ మూర్తి, గన్నెప్పుడు పాల్గొన్నారు.

## కలెక్టర్‌ను కలిసిన బీసీ సంఘం నేతలు



**శ్రీకాకుళం టౌన్, ఫిబ్రవరి 8 (వార్త):** జాతీయ బీసీ సంక్షేమ సంఘం శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు పిట్ట చంద్రపతి రావు, అమిరుల్లా బేగ్, దామోదర కేశవ, అడపాక రాంబాబు, రావు పల్లి సురేంద్ర, నాగరాజు గురువారం నగరపాలక సంస్థ కమిషనర్ తమీమా అన్సారీయాని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అలాగే కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ కలిసి దుశ్శాలువ కప్పి సన్మానించారు.

## ఎన్నికల శంఖారావం సభకు తరలిరండి



**సారవకోట, ఫిబ్రవరి 8 (వార్త):** జిల్లాలో ఈనెల 12న లోకేష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించే ఎన్నికల శంఖారావానికి నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి కోరారు.అడ్డపనసలోని టీడీపీ కార్యాలయంలో గురువారం జలుమూరు, సారవకోట మండల, క్లస్టర్, యూనిట్, ఇంచార్జ్లు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారా లోకేష్ బాబు ఉత్తరాంధ్ర పర్యటనను విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి ధర్మాన తేజ కుమార్, సారవకోట మండల పార్టీ అధ్యక్షుడు కత్తిరి వెంకటరమణ, వెలమల రాజేంద్ర నాయుడుచ, ప్రధాన కార్యదర్శి బగ్గు గోవింద రావు, ఇసై నాగరాజ్, పట్ట ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

## రైతాంగ సమస్యలు పరిష్కరించండి

**శ్రీకాకుళం టౌన్, ఫిబ్రవరి8 (వార్త):** రైతాంగ సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకుడు అయినింటి లోకనాథం అన్నారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులను, వరద బాధితులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కరువు, తుఫాను బాధితులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనేకమార్లు పోరాటం చేసినప్పటికీ ముఖ్యమంత్రికి చీమకుట్టినట్లు కూడా లేదని విమర్శించారు. రైతులకు, కౌలు రైతులకు రెండు లక్షల రూపాయలు వరకు అన్ని రకాల పంటల రుణాలను మాఫీ చేయాలని, ప్రతి ఎకరానికి 15వేల రూపాయలు సాగు సాయం అందించాలని, కరువు, తుఫాన్ వల్ల నష్టపోయిన రైతాంగానికి తక్షణం ఇన్‌పుట్ సబ్సిడీ, బీమా పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో వంశధార ప్రాజెక్టు పనులు పూర్తి చేసి రైతులకు వేలాది ఎకరాలకు సాగునీరు అందించవచ్చని, వంశధార రెండవ దశ, ఆఫ్షోర్ రిజర్వాయర్ పనులు పూర్తి చేస్తే లక్షలాది ఎకరాలకు నీరు అందించాలన్నారు. ధర్నాలో రైతు సంఘం నాయకులు చింత ఎర్రయ్య, లక్కోజు శ్రీనివాస్, జన్ని సోమేశ్ పాల్గొన్నారు.

# శభాష్.. పోలీస్

*** అంబేడ్కర్ జంక్షన్ నుంచి ఆర్ట్స్ కళాశాల రహదారిలో షాపుల యజమానులకు వార్నింగ్ * నో పార్కింగ్‌లో వాహనాలు నిలిపితే చర్యలు: ట్రాఫిక్ సీఐ అవతారం**



**శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 8 (వార్త):** నగరంలోని అంబేడ్కర్ జంక్షన్ నుంచి ఆర్ట్స్ కళాశాలకు వెళ్లే రహదారి ఆక్రమణలకు గురైన విషయం తెలిసిందే. ఒకవైపు పండ్లు, ఇతర దుకాణాలు, మరోవైపు ఆసుపత్రులు, భోజన హోటళ్లు ఉంటాయి. దీంతో షాపులకు, ఆసుపత్రులకు వెళ్లే వారు తమ వాహనాలను రోడ్డుపైనే పార్కింగ్ చేస్తున్నారు. దీంతో 40 అడుగుల రహదారి 20 అడుగులకు కుచించుకుపోతోంది. దీంతో రహదారిలో ఎప్పటికప్పుడు ట్రాఫిక్ సమస్య నెలకొంటోంది. నిత్యం ప్రమాదాలు జరిగి వాహనచోదకులు క్షతగాత్రులు అవుతున్నారు. ఈవిషయం పోలీసులకు తెలిసినా పట్టించుకున్న దాఖలాలు లేవు. ట్రాఫిక్ సీఐగా






అవతారం బాధ్యతలు తీసుకున్న తర్వాత నగరంలో ట్రాఫిక్‌పై దృష్టి సారించారు. గురువారం కాలేజీ రోడ్డులోని పండ్ల షాపులు, మెస్, ఆసుపత్రి యాజమన్యాలకు పిలిపించి సీఐ అవతారం మాట్లాడారు. నిత్యం రద్దీగా ఉండే ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇబ్బంది కలిగించకూడదని, అలా ఇబ్బంది కలిగిస్తే చర్యలు చేపడతామన్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్య అధికమవుతుందని అందువల్ల వాహనదారులకు ఎటువంటి ఇబ్బందులు కలిగించకూడదని అలా కలిగిస్తే మాత్రం ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న షాపుల్ని తొలగించే పరిస్థితి వస్తుందన్నారు. అది రాకుండా షాప్ యజమానులు జాగ్రత్త పడాలని సూచించారు. జీవనభృతి కోసం మీరు పెట్టుకున్న షాపులు ఎవరికి అడ్డుకాకూడదన్నారు.

# వైభవంగా.. మహాలింగార్చన

**అరసవల్లి, ఫిబ్రవరి8 (వార్త):** ఆరోగ్య ప్రదాత సూర్యనారాయణ స్వామి అనివెట్టి మండపంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ఆలయ వేదపండితులు, అర్చకులు గురువారం మహాలింగార్చన నిర్వహించారు. అలాగే ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు, సభ్యుడు గోండు సీతారాంలు సూర్యనారాయణస్వామిని దర్శించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకర శర్మ స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. స్వామి వారి జ్ఞాపికను ఆలయ ఈవో డీఎల్‌వీ రమేష్ బాబు అందజేశారు.



**అరసవల్లి డిప్యూటీ కమిషనర్‌గా రమేష్‌బాబు**

ప్రత్యక్షదైవం సూర్యనారాయణ స్వామి దేవస్థానంలో నూతన డిప్యూటీ కమిషనర్‌గా డీఎల్‌వీ రమేష్ బాబును నియమిస్తూ దేవదాయ ధర్మదాయ శాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతవరకు పనిచేసిన ఆలయ ఈవో వి.హరి సూర్య ప్రకాష్‌ను బదిలీ అయింది. గురువారం రమేష్‌బాబు బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ఆయన సూర్యనారాయణస్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఆయనకు ఆలయ ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకర శర్మ, అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించారు. ఆలయ పాలకమండలి సభ్యులు మండవిల్లి రవి, కొంచాడ సోమేశ్వం రావు, కోటేశ్వర చౌదరి జలగడుగుల శ్రీనివాసరావు పుష్పగుచ్ఛమందించి ఆహ్వానం పలికారు.

**ఆలయాభివృద్ధికి డాక్టర్ దానేటి లక్ష విరాళం**

సూర్యనారాయణ స్వామి దేవస్థానం అభివృద్ధికి శ్రీకాకుళం వాస్తవ్యుడు, ప్రముఖ వైద్యుడు దానేటి శ్రీధర్ గురువారం లక్ష రూపాయల చెక్కును విరాళంగా అందజేశారు. అంతకుముందు స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయాభివృద్ధికి తనవంతు సహాయ సహకారాన్ని అందిస్తానని దానేటి శ్రీధర్ తెలిపారు.

**రథసప్తమి ఉత్సవంపై నేడు సమావేశం**

సూర్యనారాయణ స్వామి దేవాలయంలో ఈనెల 16న జరిగే రథసప్తమి ఉత్సవం నిర్వహణపై ఆర్డీవో సీహెచ్ రంగయ్య ఆధ్వర్యంలో సమావేశం ఉంటుందని ఈవో రమేష్‌బాబు తెలిపారు. దేవదాయ, పోలీస్, అగ్నిమాపక, ఆరోగ్య, మున్సిపల్, విద్యుత్, రెవెన్యూ, తదితర శాఖల అధికారులు సమావేశంలో పాల్గొంటారన్నారు.



## రాళ్ల చెరువు గండి పూడ్చండి

**సంతబొమ్మాళి, ఫిబ్రవరి8 (వార్త):** తిత్లీ తుఫాన్ సమయంలో గండి పడిన రాళ్ల చెరువుకు నేటికీ మరమ్మతులు చేయకపోవడంతో రైతులకు సాగునీరు అందడం లేదని ఎస్‌బీ కొత్తూరు పంచాయతీ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఈ ప్రాంతం రైతుల సాగు నీటి ఇబ్బందులను ఇటీవల జిల్లా కలెక్టర్‌కు స్పందనలో పిర్యాదు చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రైతులను ఆదుకోవాలని వారు కోరారు. సంతబొమ్మాళి మండలం ఎస్.బి కొత్తూరు గ్రామ సర్పంచ్ ప్రతినిధి ఉప్పాడ లోకనాథం ఆధ్వర్యంలో పలువురు ప్రజా ప్రతినిధులు, రైతులు స్పందన లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు గురువారం గ్రామ పంచాయితీ, పరిసర గ్రామ రైతులతో కలిసి ఫిర్యాదు కాపీలను విలేకరులకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు తమ సమస్యను తెలియజేశామని, సానుకూలంగా స్పందించారన్నారు. రాళ్ల చెరువుకు గత తిత్లీ తుఫానుకు గండి పడిందని, అప్పటి నుంచి ఆ చెరువులో ఉన్న నీరు వృధాగా సముద్రంలోకి కలిసిపోతుందన్నారు. చెరువు గండిని పూడ్చి, గ్రామ రైతులని ఆదుకోవాలన్నారు. ఆయకట్టు కింద 40 ఎకరాల భూమి ఉందని, సాగునీరు అందక బీడుగా మారిపోతోందని తెలిపారు. సమావేశంలో ఎంపీటీసీ జేఎస్ రాజు, సావుకారి ధర్మారావు, సావుకారి జనార్ధరావు, సావుకారి భాస్కరరావు పాల్గొన్నారు.



## పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేయాలి

**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 8 (వార్త):** నియోజకవర్గంలోని అన్నిపోలింగ్ కేంద్రాలు ఎన్నికలకు సిద్ధం చేయాలని ఎన్నికల అధికారి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బి.సుదర్శన్ దొర తెలిపారు. తహశీల్దార్ కార్యాలయంలో సెక్టార్ అధికారుల తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ డిప్యుటీ కలెక్టర్ మాట్లాడుతూ సెక్టార్ ఆఫీసర్స్ వారికీ కేటాయించిన రూట్ లలో అన్ని పోలింగ్ స్టేషన్లు అన్ని సదుపాయాలు ఉండేలా చూసుకోవాలన్నారు. గ్రామాలలో ఓటు హక్కు వినియోగంపై బీఎల్వోలు అవగాహన కల్పించాలన్నారు. సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని డిప్యూటీ కలెక్టర్ హెచ్చరించారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక



## తహశీల్దార్‌ను కలిసిన నేతలు

**సంతబొమ్మాళి, ఫిబ్రవరి 8 (వార్త):** ఇటీవల సంతబొమ్మాళి తహశీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన సత్యనారా యణను గురువారం తహసీల్దార్ కార్యాలయంలో దళిత నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువతో సత్కరించారు. అలాగే సంతబొమ్మాళి పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐకి మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. అలాగే వైసీపీ నరసాపురం సర్పంచ్ దుక్క భూషణ్ రెడ్డి, పాల తలగాం సర్పంచ్ ప్రతినిధి నక్కిట్ల నరేష్, తోటాడ సర్పంచ్ ప్రతినిదిధి యర్నాగుల రామరాజు, మరువాడ మత్స్యకార సహకార సంఘం అధ్యక్షుడు సూరాడ జోగారావు కలిసి పుష్పగుచ్ఛం అందించారు. కార్యక్రమంలో దళిత నాయకులు కూరాకుల అప్పారావు గేదెల చంద్రరావు, కూరాకుల సుబ్బారావు, కలింగపట్నం నాగరాజు, దువ్వారపు ప్రసాద్, జగ్గారావు, రాజ్ కుమార్, అక్కురోడ అప్పన్న పాల్గొన్నారు.

## పరిహారం..



# పరిహాసం

*** పోర్టు నిర్మాణంతో నిర్వాసితులకు అన్యాయం * నేటికీ అందని నష్టపరిహారం**
*** కార్యాలయాలు, నేతల చుట్టూ ప్రదక్షిణలు * అమలుకాని హామీలతో ఇబ్బందులు**
*** బలవంతంగా భూముల సేకరణపై విమర్శలు**

**సంతబొమ్మాళి, ఫిబ్రవరి 8 (వార్త):** జిల్లాకు చెందిన మత్స్యకారులు వలసబాట పట్టకుండా ఉండేందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం సంతబొమ్మాళి మండలం మూలపేట వద్ద పోర్టు నిర్మాణం చేపడుతోంది. రూ.4,362 కోట్ల వ్యయంతో గతేడాది ఏప్రిల్ 19న ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి పోర్టు పనులను ప్రారంభించారు. పోర్టు నిర్మాణంతో జిల్లా రూపురేఖలు మారిపోతాయని, మూలపేట అభివృద్ధికి కేంద్ర బిందువుగా మారుతుందని, మత్స్యకారులకు ఉపాధి లభిస్తుందని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆనాటి బహిరంగ సభలో ప్రకటించారు. నిర్వాసితులకు అన్యాయం జరగనివ్వబోమని, నష్టపరిహారం అందించి ఆదుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో పోర్టు కోసం భూములు అప్పగించిన నిర్వాసితులకు నేటికీ నష్టపరిహారం ఇవ్వలేదు. పోర్టు పనులు వేగంగా జరుగుతున్నా బాధిత కుటుంబాలకు మాత్రం పరిహారం పంపిణీలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. నిర్వాసితులకు ఆధునిక సౌకర్యాలతో పునరావాస కాలనీ కడతామని తెలిపారు. మూలపేట, విష్ణుచక్రం గ్రామాల్లో మొత్తం 594 మందికి నిర్వాసిత కుటుంబాలకు పరిహారం అందించేందుకు గుర్తించారు. వీరిలో పలువురికి చెల్లింపులు జరిగాయి. మిగతా వారికి పరిహారం ఇవ్వాల్సివుంది. వ్యవసాయ భూములకు ఎకరాకు రూ.25 లక్షల చొప్పున పరిహారం అందజేసి 320 ఎకరాలు సేకరించారు. 30 మందికిపైగా అప్పట్లో భూములు ఇవ్వకపోవడంతో అధికారులు బలవంతంగా సంతకాలు తీసుకుని వారి ఖాతాలో పరిహారం వేస్తామని చెప్పినా ఇప్పటివరకు ఎలాంటి స్పష్టత లేదు. మూలపేట, విష్ణుచక్రం గ్రామాల్లో 12 మందికి యూత్ ప్యాకేజీ అందజేయాలని గ్రామస్థులు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. జీడిమామిడి చెట్టుకు గతంలో రూ.5వేలు అందిస్తామని స్థానిక ప్రజాప్రతినిధులు మాటిచ్చి రూ.2,500 చొప్పున ఇచ్చి సరిపెట్టారు. చెట్లు కోల్పోయిన 40 మందికి సాయం అందలేదు. నిర్వాసితులకు ఇచ్చిన ప్యాకేజీ నుంచే ఇంటి నిర్మాణానికి రూ.3.50 లక్షలు భరించాలని చెబుతున్నారు. అంత తక్కువ మొత్తంలో ఇల్లు ఎలా కట్టుకోగలమని, ప్రభుత్వమే నిర్మించి ఇవ్వాలని శంకుస్థాపనకు ముఖ్యమంత్రి వచ్చిన సమయంలో నిర్వాసితులు వినతిపత్రం అందజేశారు. నేటి వరకు దీనిపై స్పష్టత లేదు. ఒక్కో పశువుల శాలకు రూ.25 వేలు అందజేస్తామని హామీ ఇచ్చినా అమలు కాలేదు. మూలపేట, విష్ణుచక్రం గ్రామాల్లో నిర్వాసితులకు చట్ట ప్రకారం రావాల్సిన నష్టపరిహారం చెల్లించడం లేదు. 33 పీడీఎఫ్‌లతో పాటు పలువురికి ఇప్పటికి పరిహారం అందజేయలేదు. దీనిపై పలుమార్లు మంత్రి, కలెక్టర్‌కు విన్నవించినా పట్టించుకున్న దాఖలాలు లేవు. అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా కరుణించేవారు కరువయ్యారని నిర్వాసితులు వాపోతున్నారు. అధికారులు మాత్రం నిధులు మంజూరైన వెంటనే పరిహారం అందిస్తామని చెబుతున్నారు. నిధులు ఎప్పుడు వస్తాయో తమకు ఎప్పుడు అందుతాయోనని నిర్వాసితులు ఎదురుచూస్తున్నారు.



## గుట్టుగా.. గుట్టలు గుట్టలుగా..

# గంజాయి రవాణా

*** జిల్లా మీదుగా ఇతర ప్రాంతాలకు తరలింపు**
*** పోలీసులకు అనుమానం రానివిధంగా ముఠాగా ఏర్పడి బస్సులు, రైళ్లలో దాటవేత**
*** చెక్‌పోస్టుల వద్ద కొరవడిన నిఘా**
*** వారం వ్యవధిలో పెద్ద ఎత్తున పట్టుబడిన గంజాయి**

**శ్రీకాకుళం క్రైం, ఫిబ్రవరి 8 (వార్త):** ఒడిశా నుంచి సరిహద్దు జిల్లా శ్రీకాకుళం మీదుగా గుట్టుగా ఇతర ప్రాంతాలకు గంజాయి తరలి పోతోంది. పోలీసులకు అనుమానం రానివిధంగా గంజాయిని కట్టలు కట్టి బస్సు, రైలు మార్గాల మీదుగా తరలించేస్తున్నారు. సామాన్య ప్రయాణికుల మాదిరిగా బ్యాగుల్లో గంజాయిని కుక్కేసి రవాణా చేసేస్తున్నారు. మరికొందరైతే జాతీయ రహదారిలో గుట్టుచప్పుడుకాకుండా తరలిస్తున్నారు. ముందొక వాహనం, వెనుకొక వాహనం గంజాయి తరలించే వాహనాలపై నిఘా పెడుతూ అక్రమార్కులు ముందుకుసాగుతున్నాయి. ఎక్కువగా యువత, మహిళల ద్వారా గంజాయి తరలింపు సాగుతోంది. ఒడిశా, ఆంధ్రా సరిహద్దు ప్రాంతాలైన ఇచ్ఛాపురం, మెళియాపుట్టి, పాతపట్నం, బత్తిలి, కొత్తూరు మండ లాలు మీదుగా గంజాయిని తరలిస్తున్నారు. చెక్‌పోస్టుల వద్ద ప్రతి ఒక్క వాహ నాన్ని



చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది తనిఖీ చేస్తారు. అయినప్పటికీ గంజాయి తరలింపు ఏవిధంగా సాగుతుందో మిలియన్ డాలర్ల ప్రశ్నగానే మారింది. చెక్‌పోస్టుల వద్ద సిబ్బంది నిర్లక్ష్యమా? లేకుంటే వారిలో కొందరికి కాసులు అందుతున్నాయా అన్నది పోలీసు జిల్లా ఉన్నతాధికారులు నిఘా పెట్టాల్సివుంది. అలాగే రైలు, బస్సుల్లోనూ గంజాయి రవాణా సాగుతోంది. గతంలో ట్రాన్స్‌పోర్టు కార్యాలయాల ద్వారా గంజాయి తరలిస్తూ పట్టుబడిన విషయం తెలిసిందే. జిల్లా పోలీసు అధికారులు గంజాయి రవాణాపై ఉక్కుపాదం మోస్తామని చెబుతున్నారని, అది కఠినంగా అమలయ్యేలా చూస్తే తప్ప గంజాయి తరలింపునకు అడ్డుకట్ట పడే అవకాశం లేదన్న అభిప్రాయం వినిపిస్తోంది.



## మొక్కజొన్న పంటను సంరక్షించుకోవాలి



**మెళియాపుట్టి, ఫిబ్రవరి8 (వార్త):** మొక్కజొన్న పంటను సంరక్షించు కోవాలని ఏడీ మధు బాబు అన్నారు. మెళియాపుట్టి, కొసమాల గ్రామాల్లో సాగు చేస్తున్న మొక్కజొన్న పంటలను మండల వ్యవసాయ అధికారి దానకర్ణుడుతో కలిసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో అధికంగా మొక్కజొన్న తెగుళ్లు బారిన పడే అవ కాశముందని, రైతులు జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆకు ఎండు తెగులు, కత్తెర పురుగు ఉధృతిని గమనించామని రైతులు సత్వరమే సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఎండు తెగులు నివారణకు ఒక ఎకరాకు ప్రోఫికొనజల్ 200 మిల్లీలీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. అలాగే కత్తెర పురుగు నివారణకు ఒక ఎకరాకు ఇమామెక్టిన్ బెంజోయెట్ 100 గ్రాములు, వేప నూనె ఒక లీటర్ 200 లీటర్లు నీటిలో కలిపి పిచికారీ చేయడం మంచిదన్నారు. అనంతరం ఫుడ్ అండ్ న్యూట్రిషన్ పథకం కింద వేపనూనె, ఇమా మెక్టిన్ బెంజేట్ రాయితీపై రైతులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు యమునా, త్రివేణి, పల్లవి రైతులు పాల్గొన్నారు.

## సరిహద్దు గ్రామాల్లో ఓటర్ల జాబితా పరిశీలన

**మెళియాపుట్టి, ఫిబ్రవరి8 (వార్త):** పాతపట్నం నియోజకవర్గం పరిధిలోని ఆంధ్రా-ఒడిశా సరిహద్దు గ్రామాల్లోని ఓటర్ల జాబితాను టీడీపీ నాయకులు పరిశీలిస్తున్నారు. ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగిందని టీడీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ ఇటీవల ఆరోపించారు. దీంతో టీడీపీ శ్రేణులు ఆయా గ్రామాలు సందర్శించి ఓటరు జాబితాలను పరిశీలిస్తున్నారు. ఒడిశాకు చెందిన ఓటర్ల పేర్లు జాబితాలో ఉండడాన్ని గమనించారు. దీనిపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళతామని టీడీపీ నాయకులు చెబుతున్నారు.

